మురసు తుఫాన్‌పై పోలీసు యంత్రాంగం అప్రమత్తం



04

RNI: APTEL/26/A8235

అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి
అనుభవం కలిగిన, జర్నలిజంపై
ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను.
కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090
8374168090

నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -34 | మంగళవారం 03 నవంబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-



సోమిరెడ్డిపై...

కాకాణి ఫైర్

అవినీతి, అక్రమాలపై సూటి ప్రశ్నలు!

- అభివృద్ధి అంటే గ్రావెల్, ఇసుక తవ్వకాలు.. లేఅవుట్ల వద్ద డబ్బులు దండుకోవడమేనా?
- ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాణానికి సిద్ధమా? సోమిరెడ్డికి కాకాణి సవాల్
- వైసీపీ కార్యకర్తలను పోలీసులతో బెదిరిస్తున్నారంటూ ధ్వజం
- సర్వేపల్లిలో ఐదు జడ్పీటీసీలతో పాటు ఎంపీటీసీ స్థానాలన్నీ వైసీపీవే

పొదలకూరు,(అక్షర దర్శిని):

టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పొదలకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి తీరుపై నిప్పులు చెరిగారు. పొదలకూరులో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత సోమిరెడ్డికి లేదని విమర్శించారు.

అభివృద్ధి అంటే దోపిడీనేనా?

పొదలకూరులో అభివృద్ధి పనుల గురించి సోమిరెడ్డికి ఏం తెలుసని కాకాణి ప్రశ్నించారు. గ్రావెల్, ఇసుక తవ్వకాలు, లేఅవుట్ల యజమానుల నుంచి డబ్బులు వసూలు చేయడమే అభివృద్ధి అని భావిస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. లేఅవుట్ల వద్ద డబ్బులు తీసుకున్నారన్న తన ఆరోపణలు నిజం కాదని చెప్పగలరా? ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేయడానికి సిద్ధమా? అంటూ సోమిరెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు.

దొంగలకు రాజకీయ అండనా?

పొదలకూరులో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ పార్కును ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని టీడీపీలో చేర్చుకోవడమే కాకుండా, ఎన్నికల్లో అభ్యర్థుల కొరతతో అలాంటి వారిని బరిలోకి దింపేందుకు సిద్ధపడ్డారని కాకాణి విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేగా కొనసాగుతున్న సోమిరెడ్డికి సొంత పార్టీలో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకని దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని బెదిరింపులు!

వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారానికి ఆటోను ఉపయోగించుకున్నందుకు దాని యజమానిని ఫోన్ చేసి బెదిరించారని కాకాణి ఆరోపించారు. ఆటోలో మద్యం పెట్టి కేసు నమోదు చేసి అరెస్టు చేస్తామని పొదలకూరు ఎస్ఐ హెచ్చరించినట్లు పేర్కొన్నారు. సాధారణంగా పోలీసులు దొంగలను పట్టుకుంటారని, కానీ పొదలకూరులో రాజకీయ నాయకుల మాటలు విని పోలీసులే అక్రమాలకు పాల్పడే పరిస్థితి ఏర్పడిందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎస్ఐ కూడా సోమిరెడ్డి రాజకీయ ఒత్తిళ్లకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

బహిరంగ చర్చకు సిద్ధం..

సర్వేపల్లి నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో తేల్చేందుకు బహిరంగ చర్చకు తాను సిద్ధమని కాకాణి ప్రకటించారు. ప్రజలు సోమిరెడ్డిని నమ్మే పరిస్థితుల్లో లేరని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైసీపీ విజయధ్వంకా!

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు జడ్పీటీసీ స్థానాలతో పాటు అన్ని ఎంపీటీసీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని కాకాణి ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా అధికారంలో ఉండి కూడా సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టుకోలేని పరిస్థితి సోమిరెడ్డికి ఎదురైందని విమర్శించారు. ప్రజాబలంతో ఎన్నికల బరిలోకి దిగుతున్న వైఎస్సార్‌సీపీకి విజయం తథ్యమని స్పష్టం చేశారు.



సర్వేపల్లిని దోపిడీకి అడ్డాగా మార్చిన

కాకాణి

కాకాణిపై సోమిరెడ్డి ఘాటు విమర్శలు

- స్థానిక ఎన్నికల్లో దుర్మార్గాలకు చరమగీతం పాడి అభివృద్ధికి పట్టం కట్టాలి
- టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు

19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

పొదలకూరు,(అక్షర దర్శిని):

పరిషత్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పొదలకూరు మండలం విరువూరులో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎంతోమంది హేమాహేమీలు ఎమ్మెల్యేలుగా పనిచేశారని, కాకాణి గోవర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాతే సర్వేపల్లి దుర్మార్గాలకు నెలవుగా మారిందని సోమిరెడ్డి ఘాటుగా విమర్శించారు. పొదలకూరు ప్రాంత ప్రజల ఓట్లతో రాజకీయంగా ఎదిగిన కాకాణి, ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టకుండా ప్రభుత్వ, ప్రైవేటు భూములను కాజేయడం, ఇతరుల మైనింగ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని దోపిడీకి పాల్పడటమే ఆయన సాధించిన ఘనత అంటూ ఆరోపించారు. విరువూరులో దేవుడి భూములను ఆక్రమించిన సురేష్ కుమార్ రెడ్డి వైసీపీ తరఫున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, విచారణ జరిపి ఆక్రమణకు గురైన దేవుడి భూములను తిరిగి స్వాధీనం చేసుకుని దేవుడికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో అనర్హులకు పట్టాలు మంజూరు చేశారని, దీనిపై విచారణ జరిపించి అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇలాంటి దుర్మార్గాలకు ప్రజలు తమ ఓటుతో చరమగీతం పాడాలని, అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డితో పాటు పొదలకూరు మండలంలోని 19 మంది ఎంపీటీసీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.





టీడీపీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం

▶▶ కుల్లూరు సమావేశంలో వెల్లడి.. అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపు

కలువాయి,(అక్షర దర్శిని): ప్రస్తుతం తాను ఏ రాజకీయ పార్టీలోనూ లేనప్పటికీ, కలువాయి మండలంలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం వెల్లడించారు. ఆదివారం రాత్రి కలువాయి మండలం కుల్లూరులోని తన స్వగృహంలో మండలంలోని తన ఆత్మీయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు.ఈ సందర్భంగా ఆత్మీయులకు విందు ఏర్పాటు చేసిన అనంతరం మండలంలోని రాజకీయ పరిస్థితులు, స్థానిక ఎన్నికలపై వారితో చర్చించారు. జడ్పీటీసీ అభ్యర్థి ఆరవ లిఖిత, కలువాయి ఎంపీటీసీ సెగ్మెంట్-1 అభ్యర్థి చల్లా రఘురామిరెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాదాసు గంగాధరం పిలుపునిచ్చారు. మండలంలోని టీడీపీ అభ్యర్థుల గెలుపునకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కలువాయిలోని బలిజ సామాజిక వర్గం ప్రజలంతా ఐక్యంగా ఉండి అభ్యర్థుల విజయానికి సహకరించాలని కోరారు.

నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్రతో పాటు జిల్లాలోని ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా పరిషత్ చైర్మన్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ అభ్యర్థి ఆరవ లిఖిత, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, ఆయన సతీమణి నలినమ్మ దంపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల సీనియర్ నాయకులు అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, అరిబోయిన మల్లికార్జున యాదవ్, డాక్టర్ రాజేష్, పిడుగు కొండారెడ్డి, కలువాయి బలిజ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మురసు తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై అయ్యప్ప



చేజర్ల,(అక్షర దర్శిని): మురసు తుఫాను ప్రభావంతో నెల్లూరు జిల్లాలో భారీ గాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో చేజర్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అయ్యప్ప సూచించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని, బీచ్‌లు, వాగులు, వంకల వద్దకు వెళ్లకూడదని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రమాదకర నిర్మాణాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, తీగలను తాకవద్దని, గర్భిణులు, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి..

▶▶ గ్రామంలో విషాదం విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం..

కలువాయి,(అక్షరదర్శిని): నెల్లూరు జిల్లా కలువాయి మండలం కే.సి. గోపవరం సమీపంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వివరాల్లోకి వెళితే.. దాచూరు గ్రామానికి చెందిన బైరుపోగు గణేష్ (27) విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికి అందిన వయసులో యువకుడు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. ఘటనకు గల పూర్తి వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతితో దాచూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



అవినీతికి మరో రూపం సోమిరెడ్డి.. కాకాణి తీవ్ర విమర్శలు









▶▶ సర్వేపల్లిలో ఇసుక, మట్టి, గ్రావెల్ నుంచి లేఅవుట్ల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణ

▶▶ దేగపూడిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

పొదలకూరు,(అక్షర దర్శిని): సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అవినీతికి మరో రూపంగా మారారని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఇసుక, మట్టి, గ్రావెల్ తవ్వకాలతో పాటు లేఅవుట్ల వద్ద కూడా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై అనిశ్చితితో నియోజకవర్గంలో అందినకాడికి దోచుకుంటున్నారని విమర్శించారు.సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం దేగపూడిలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి బచ్చలపల్లి సురేష్ కుమార్‌రెడ్డి(చిన్ని), ఇనుకుర్తి సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థి మంజులకు మద్దతుగా ప్రచారం చేస్తూ, రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అభ్యర్థులతో కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. చంద్రబాబు రెండున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని, జిల్లాలోని పలు ప్రాంతాల్లో బెదిరి ంపులు, బ్లాక్‌మెయిలింగ్‌లు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. అభ్యర్థులకు తెలి యకుండానే నామినేషన్లు ఉపసంహరించుకున్న సందర్భాలున్నాయని, తద్వారా ఏకగ్రీవాలు సాది ంచేందుకు ప్రయత్నించారని విమర్శించారు. అయితే సర్వేపల్లి నియోజకవర్గంలో 79 ఎంపీటీసీ స్థానా లకు, ఐదు జడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థులు పోటీలో నిలిచి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్నారని తెలిపారు.

గత ప్రభుత్వంలో సంక్షేమానికి ప్రాధాన్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేశారని కాకాణి పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించారని, అమ్మఒడి ద్వారా విద్యార్థుల తల్లులకు ఆర్థిక సహాయం అందించారని గుర్తుచేశారు. రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందించడంతో పాటు, పెన్షన్లను దశలవారీగా పెంచి రూ.3,000 వరకు చేర్చామని తెలిపారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొత్తగా ఎన్ని పెన్షన్లు మంజూరు చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ సరుకులు, పెన్షన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించడంతో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు సేవలను చేరువ చేశామని పేర్కొన్నారు.

హామీలు అమలు చేయడంలో విఫలం

టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కాకాణి విమర్శించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతకాలతో హామీ పత్రాలు అందించి, ప్రతి కుటుంబానికి ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వడం లేదని ఆరోపించారు.రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయా ణ పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, తగినన్ని బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కొత్త బస్సులు ప్రవేశపెట్టకుండా పాత బస్సులకే రంగులు మార్చుతున్నారని ఆరోపించారు. రేషన్ సరుకులు, పెన్షన్లు, యూరియా వంటి అవసరమైన వస్తువుల పంపిణీలో గతంలో ఉన్న సౌకర్యాలు కనిపించడం లేదని, మరోవైపు మద్యం సరఫరాపై విమర్శలు చేశారు.

గ్రామాల్లో అభివృద్ధి చేశాం

తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సమయంలో గ్రామాల్లో సిమెంట్ రహదారులు, సైడ్ కాలువలు నిర్మించామని కాకాణి తెలిపారు. ఇళ్లు లేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని, విద్యుత్, తాగునీరు, సాగునీటి సదుపాయాలను కల్పించామని చెప్పారు. ఆయకట్టు పరిధిలోకి రాని భూములను సాగునీటి పరిధిలోకి తీసుకురావడానికి, రైతులకు పట్టాలు ఇప్పించడానికి కృషి చేశామని పేర్కొన్నారు.ప్రజలు గత ప్రభుత్వాల పనితీరును బేరీజు వేసుకుని, గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కాకాణి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక అభ్యర్థులు పాల్గొన్నారు.

పెన్నబద్వేల్‌లో టీడీపీ అభ్యర్థుల ఇంటింటి ప్రచారం









▶▶ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మెట్టకూరు ధనుంజయరెడ్డి

కలువాయి,(అక్షర దర్శిని): నెల్లూరు జిల్లా కలువాయి మండలం పెన్నబద్వేల్ గ్రామంలో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఆరవ లిఖిత, ఎంపీటీసీ అభ్యర్థి కోటంరెడ్డి లక్ష్మి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, కేంద్ర సహకార సంఘం చైర్మన్, కలువాయి--రాపూరు మండలాల ఇన్‌ఛార్జి మెట్టకూరు ధనుంజయరెడ్డి పాల్గొని అభ్యర్థులతో కలిసి గ్రామంలోని ఇళ్లకు వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు సామాజిక పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలుకే పరిమితమయ్యారని విమర్శిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై కూడా దృష్టి సారించిందని పేర్కొన్నారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి అభ్యర్థులకు ఓటర్లు మద్దతు తెలిపి గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి, యువజన నాయకుడు శివారెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు నాయుడు, మల్లికార్జున యాదవ్, కిషోర్‌రెడ్డి, బట్టిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున నాయుడు, తేజ, రాధాకృష్ణారెడ్డి, మహేష్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేపల్లిలో కూటమి క్లీన్ స్వీప్ ఖాయం..









▶▶ ఐదు జెడ్పీటీసీలతో పాటు ఐదు ఎంపీపీలను కైవసం చేసుకుంటాం..

▶▶ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అద్భుత స్పందన..

▶▶ వైసీపీ పని అయిపోయింది..

▶▶ పులివెందులలోనే అభ్యర్థులు దొరకని పరిస్థితి

▶▶ వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు, సర్వేపల్లి, ఈదగాలి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటాచలం,(అక్షర దర్శిని):పరిషత్ ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో పాటు ఐదు జెడ్పీటీసీ స్థానాలు, ఐదు ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేయబోతున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని తెలిపారు.వెంకటాచలం మండలంలోని తిక్కవరప్పాడు, సర్వేపల్లి, ఈదగాలిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జెడ్పీటీసీ అభ్యర్థి దారా అన్నమ్మతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. పేదలు, రైతుల సంక్షేమం కోసం రాజీలేకుండా పనిచేయడం తన బాధ్యత అని అన్నారు. 2018లో నెల్లూరు జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను డీకేటీ పట్టాలుగా మార్చి చరిత్ర సృష్టించామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని బోగోలు మండలానికి తీసుకొచ్చి ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనే ఏడు వేల ఎకరాలకు పైగా భూములను డీకేటీ పట్టాలుగా మార్చామని, లబ్ధిదారుల్లో అత్యధికులు దళితులు, గిరిజనులేనని పేర్కొన్నారు. ఒక్క ఈదగాలి గ్రామంలోనే 500 ఎకరాలకు డీకేటీ పట్టాలు అందించామని, నేడు ఆ రైతులు భూములపై యాజమాన్య హక్కులు పొందడంతో పాటు అన్నదాత సుఖీభవ వంటి పథకాల ప్రయోజనాలను పొందుతున్నారని వివరించారు.రూర్బన్ పథకం ద్వారా ప్రతి పంచాయతీలో కోట్లాది రూపాయలతో సిమెంట్ రోడ్లు నిర్మించడంతో పాటు తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశామని చెప్పారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజల కోసం నిరంతరం పనిచేసే నాయకుడినని స్పష్టం చేశారు.వైసీపీ పాలనపై విమర్శలు గుప్పిస్తూ.. ఏ గ్రామానికి వెళ్లినా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అరాచకాలు ప్రజలకు గుర్తున్నాయని అన్నారు. ఇరిగేషన్ శాఖలో పనులు చేయకుండానే రూ.150 కోట్లకు పైగా దోచుకున్నారని, షట్టర్లు బిగించకుండానే కోర్టుల్లో కేసులు వేసి రూ.7 కోట్ల వరకు బిల్లులు చేసుకున్నారని ఆరోపించారు. సవిటి కాలువలను సైతం వదలకుండా రూ.26 కోట్ల నుడా నిధుల్లో అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు.వైసీపీ పని అయిపోయిందని, చివరకు పులివెందులలోనే అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. అక్రమ మైనింగ్‌లు చేయడం, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం, కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీయడం, దళితులు, గిరిజనుల భూములను ఆక్రమించడం వంటి పనులు తమకు తెలియవని అన్నారు. తాము సంపాదించిన ఆస్తులను అమ్ముకున్నామే తప్ప ఎప్పుడూ ఇతరుల ఆస్తులపై కన్నేయలేదని వ్యాఖ్యానించారు.కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు అండగా నిలుస్తున్నారని, రాబోయే పరిషత్ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సోమిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

సముద్రంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులు క్షేమం







▶▶ మత్స్యశాఖ, మెరైన్ పోలీసుల సమన్వయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరిన బోటు

▶▶ రక్షణ చర్యల్లో అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్ల అభినందనలు

నెల్లూరు,(అక్షర దర్శిని):సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు ఇంజన్ చెడిపోవడంతో ప్రమాదంలో చిక్కుకున్న ఏడుగురు మత్స్యకారులను అధికారులు సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వైలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో చేపట్టిన రక్షణ చర్యలతో ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా మత్స్యకారులను కాపాడారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వెల్లడించారు.వివరాల్లోకి వెళితే.. కావలి నియోజకవర్గంలోని జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. నెల్లూరు సముద్ర తీర ప్రాంతానికి చేరుకున్న సమయంలో వాతావరణంలో మార్పులను గమనించి తిరిగి హార్బర్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే మార్గమధ్యంలో బోటు ఇంజన్ చెడిపోవడంతో హార్బర్ మౌత్ పాయింట్‌కు సుమారు అర కిలోమీటరు దూరంలో సముద్రంలోనే నిలిచిపోయింది.

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లో విధులు నిర్వహిస్తున్న సర్వైలెన్స్ సిబ్బంది ఈ విషయాన్ని గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు అప్రమత్తమై స్థానిక మత్స్యకారుల సహకారంతో రక్షణ చర్యలు చేపట్టారు. అయితే సముద్రంలో అలల ఉధృతి అధికంగా ఉండటంతో బోటు వద్దకు చేరుకోవడం తొలుత కష్టతరంగా మారింది.ఈ క్రమంలో బోటుకు వేసిన లంగరు తెగిపోవడంతో అలల ఉధృతికి బోటు పాతకడపాలెం గ్రామం వైపు కొట్టుకుపోయింది. అయినప్పటికీ అధికారులు, స్థానిక మత్స్యకారులు సమన్వయంతో బోటును అనుసరిస్తూ రక్షణ చర్యలను కొనసాగించారు. చివరకు బోటును పాతకడపాలెం సముద్ర తీరానికి సురక్షితంగా చేర్చి, అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులను క్షేమంగా ఒడ్డుకు తీసుకువచ్చారు.

అధికారులకు కలెక్టర్ అభినందనలు

రక్షణ చర్యల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి మత్స్యకారుల ప్రాణాలను కాపాడిన మత్స్యశాఖ అధికారులు, మెరైన్ పోలీసులు, సర్వైలెన్స్ సిబ్బంది, స్థానిక మత్స్యకారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేకంగా అభినందించారు. సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, సంబంధిత అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.



మురసు తుఫాను ప్రభావంతో విద్యుత్ శాఖ అప్రమత్తం

▶▶ పొదలకూరు విద్యుత్ ఏ.ఈ.రఘు

పొదలకూరు,(అక్షర దర్శిని): మురసు తుఫాను ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తూ ఎక్కడైనా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశారు. తుఫాను సమయంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

▶▶ డీకే మహిళా కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు

▶▶ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలి



నెల్లూరు,(అక్షర దర్శిని):నెల్లూరు నగరపాలక సంస్థ రెండో సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరగనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక డీకే మహిళా కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ పరిశీలించారు.కౌంటింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లు, వివిధ విభాగాల విధులు, అవసరమైన సౌకర్యాలను పరిశీలించిన అధికారులు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.కౌంటింగ్ విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని, పరస్పర సమన్వయంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని వారు స్పష్టం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రహంతు జానీ, టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ రఘునాథరావు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ వేళ.. నెల్లూరులో ట్రాఫిక్ ఆంక్షలు!

▶▶ ప్రత్యామ్నాయ మార్గాల్లోనే ప్రయాణించాలి

▶▶ వాహనదారులకు సౌత్ ట్రాఫిక్ సీఐ కృష్ణారెడ్డి సూచన

నెల్లూరు, (అక్షర దర్శిని) : నగరపాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నెల్లూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.మంగళవారం డీకేడబ్ల్యూ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నారు. ఈ మేరకు వాహనదారులు ముందస్తుగా అప్రమత్తమై ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సౌత్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి సూచించారు.కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లో వాహనాల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున పొదలకూరు రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకోవాలని ఆయన తెలిపారు. నగరం నుంచి పొదలకూరు రోడ్డు వైపు వెళ్లే వాహనాలు కేవీఆర్ జంక్షన్ మీదుగా ఎన్ఎస్ఆర్ బొమ్మ వద్ద కుడివైపునకు మళ్లి గాంధీనగర్ మీదుగా గమ్యస్థానానికి చేరుకోవాలి. పొదలకూరు రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలు పొదలకూరు రోడ్డు సర్కిల్ వద్ద కుడివైపునకు మళ్లి కొండాయపాలెం గేట్ సెంటర్ మీదుగా కేవీఆర్ జంక్షన్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది, ఎన్నికల ఏజెంట్ల వాహనాల కోసం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఎన్నికల కౌంటింగ్ అధికారులు, సిబ్బంది వాహనాలను డీకేడబ్ల్యూ కళాశాల ప్రాంగణంలోని నిర్దేశిత పార్కింగ్ స్థలంలో నిలిపేందుకు ఏర్పాట్లు చేశారు. వాహనాలను ఇష్టానుసారంగా రోడ్లపై నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించవద్దని పోలీసులు సూచిస్తున్నారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా, అత్యవసర సేవలకు ఆటంకాలు లేకుండా ట్రాఫిక్ నిర్వహణ చేపడుతున్నట్లు సీఐ కృష్ణారెడ్డి వివరించారు. విధుల్లో ఉన్న పోలీసుల సూచనలను పాటిస్తూ నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించాలని, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు నగర ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, నిత్యావసర వస్తువుల నిల్వలు సమృద్ధి

▶▶ ప్రజలు ఆందోళన చెందవద్దు.. వదంతులను నమ్మి అధికంగా కొనుగోలు చేయొద్దు

▶▶ కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు: కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు,(అక్షర దర్శిని): జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సిలిండర్లతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యం, చక్కెర తదితర నిత్యావసర వస్తువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వదంతులను నమ్మి ముందస్తుగా అధిక మొత్తంలో కొనుగోళ్లు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలో అందుబాటులో ఉన్న నిల్వల వివరాలను వెల్లడించారు.

ఇంధన నిల్వలు ఇలా..

నవంబర్ 2, 2026 నాటికి జిల్లాలోని 267 పెట్రోల్ బంకుల్లో 1,710 కిలోలీటర్ల పెట్రోల్, 2,832 కిలోలీటర్ల డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లాలోని 57 ఎల్పీజీ అవుట్‌లెట్లలో 21,385 సిలిండర్లు నిల్వ ఉన్నాయని పేర్కొన్నారు.

బియ్యం, చక్కెర నిల్వలు సమృద్ధి

జిల్లావ్యాప్తంగా 1,470 చౌకధరల దుకాణాల పరిధిలో 10,832.215 మెట్రిక్ టన్నుల బియ్యం, 374.727 మెట్రిక్ టన్నుల చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. అన్ని ప్రాంతాల్లో ఇంధనం, నిత్యావసర వస్తువుల సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నిత్యావసర వస్తువుల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు సంయమనం పాటిస్తూ తమ సాధారణ అవసరాలకు అనుగుణంగా కొనుగోళ్లు చేయాలని, అనవసరంగా వస్తువులను నిల్వ చేసుకోవద్దని సూచించారు. అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, వదంతులను ప్రచారం చేయవద్దని ఆయన కోరారు.

ప్రజల గుండెల్లో గౌతమ్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారు

▶▶ బ్రాహ్మణపల్లిలో ఘనంగా దివంగత మాజీ మంత్రి 55వ జయంతి వేడుకలు

మర్రిపాడు, అక్షర దర్శిని :ప్రజలతో మమేకమై, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలిచి, తన సేవా దృక్పథంతో ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న దివంగత మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని నెల్లూరు పార్లమెంటు మాజీ సభ్యుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు.ప్రజాసేవ పట్ల గౌతమ్‌రెడ్డి కనబరిచిన నిబద్ధత, రాజకీయాల్లో పాటించిన విలువలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో సోమవారం గౌతమ్‌రెడ్డి 55వ జయంతి వేడుకలను కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మణిమంజరి దంపతులు, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గౌతమ్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంలో హుందాతనం, విశ్వసనీయత, నిబద్ధతకు ప్రత్యేక స్థానం కల్పించారని కొనియాడారు. పదవిలో ఉన్నా, ప్రజల మధ్య ఉన్నా అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిచ్చేవారని గుర్తు చేసుకున్నారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు.గౌతమ్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం, ఆయన చూపిన ప్రజాసేవా మార్గంలో పయనించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని నాయకులు పేర్కొన్నారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, ప్రజల కోసం చేసిన సేవలు, పాటించిన విలువలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని గౌతమ్‌రెడ్డికి నివాళులర్పించారు.



పార్కు స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తికి టీడీపీ టికెట్ ఇచ్చారు...



▶▶ పార్కు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్మకానికి పెట్టిన వ్యక్తి నన్ను సంప్రదించాలని చూస్తే తిరస్కరించా..

▶▶ గతంలో కబ్జా ఆరోపణలపై కేసులు పెట్టించిన సోమిరెడ్డే.. ఇప్పుడు అదే వ్యక్తిని పార్టీలో చేర్చుకుని పోటీలో నిలబెట్టారు..

▶▶ కాకాణి సంచలన వ్యాఖ్యలు

పొదలకూరు,(అక్షర దర్శిని): ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని ఆక్రమించి, ప్లాట్లుగా మార్చి విక్రయానికి పెట్టిన వ్యక్తిని తెలుగుదేశం పార్టీలో చేర్చుకుని ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీలో నిలబెట్టారని మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. గతంలో ఇదే వ్యక్తిపై కబ్జా ఆరోపణలతో కేసులు పెట్టించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం అదే వ్యక్తిని పార్టీలో చేర్చుకుని ఎన్నికల బరిలో నిలబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం పొదలకూరులో మీడియాతో మాట్లాడిన కాకాణి.. పార్కు స్థలాల ఆక్రమణ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ సోమిరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు.పొదలకూరులో ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని ఆక్రమించి, ప్లాట్లుగా విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తికి టీడీపీ తరఫున ఎంపీటీసీ టికెట్ ఇవ్వడమంటే కబ్జాకోరులను ప్రోత్సహించడమేనని కాకాణి వ్యాఖ్యానించారు. గతంలో ఆ వ్యక్తి కబ్జాలకు పాల్పడ్డాడని కేసులు పెట్టించిన నువ్వే.. ఇప్పుడు అతడిని నీ పార్టీలోకి తీసుకొచ్చి ఎన్నికల్లో పోటీకి నిలబెట్టావంటూ సోమిరెడ్డిని నిలదీశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన అభ్యర్థులు దొరకక కబ్జాకోరులను వెతికి మరీ బరిలోకి దించాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు.

నన్ను కలవాలని ప్రయత్నిస్తే తిరస్కరించా

పార్కు స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు అమ్మకానికి పెట్టిన వ్యక్తి నామినేషన్లకు ముందు తనను సంప్రదించాలని చూస్తే తాను తిరస్కరించానన్నారు. టీడీపీ నాయకులు తనను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని, తనను మీరు దగ్గరకు తీస్తే టీడీపీలోకి వెళ్లనని సదరు వ్యక్తి చెప్పినట్లు తెలిపారు. ఈ విషయంపై తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్ రెడ్డి ద్వారా రాయబారం కూడా పంపించారని పేర్కొన్నారు. కబ్జాకోరులు తమకు అవసరం లేదని తాను స్పష్టం చేసినట్లు చెప్పారు. ప్రజల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని ఆక్రమించి విక్రయానికి పెట్టిన వారిని ప్రోత్సహించేది లేదని వ్యాఖ్యానించారు.

అభ్యర్థుల చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి..

సర్వేపల్లిలో వైసీపీ అభ్యర్థుల గురించి విమర్శలు చేసే ముందు తాను నిలబెట్టిన అభ్యర్థుల చరిత్ర ఏమిటో తెలుసుకోవాలని సోమిరెడ్డికి కాకాణి హితవు పలికారు. వాకాటి శ్రీనివాసులు రెడ్డి, చిన్ని గురించి మాట్లాడే ముందు తన రాజకీయ, వ్యక్తిగత నేపథ్యం ఏమిటో తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు కుటుంబ నేపథ్యాలపై విమర్శలు చేయడం కాకుండా అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడాలని సూచించారు.లేఅవుట్ల యజమానుల దగ్గర డబ్బులు తీసుకోవడం తప్ప సోమిరెడ్డి పొదలకూరుకు చేసిందేమీ లేదని ఆరోపించారు. తాను గతంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు తెలుసని, ప్రజలు తమను ఆదరిస్తారన్న నమ్మకం ఉందని చెప్పారు. అన్ని స్థానాల్లో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులు గట్టి పోటీ ఇస్తున్నారని, ఎన్నికల్లో తమకు విజయం లభిస్తుందని కాకాణి ఆశాభావం వ్యక్తం చేశారు.

మురసు తుఫాన్‌పై పోలీసు యంత్రాంగం అప్రమత్తం

▶▶ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పటిష్టమైన ముందస్తు చర్యలు

▶▶ తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

▶▶ అత్యవసర సహాయక బృందాలు, పరికరాలు సిద్ధం: జిల్లా ఎస్పీ దా. అజిత వేజెండ్ల

నెల్లూరు,(అక్షర దర్శిని): మురసు తుఫాన్ ప్రభావం నెల్లూరు జిల్లాపై ఉండే అవకాశం నేపథ్యంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ దా. అజిత వేజెండ్ల తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉండే అవకాశం ఉన్న కావలి రూరల్, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, కృష్ణపట్నం పోర్టు, చిల్లకూరు, కోట పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 98 తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ, రాష్ట్ర, జాతీయ విపత్తు స్పందన దళాలతో కూడిన క్విక్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచారు.

అత్యవసర పరికరాలు సిద్ధం

భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా రహదారులపై చెట్లు కూలిపోవడం, వరద నీరు ప్రవహించడం వంటి పరిస్థితులు ఏర్పడితే రాకపోకలకు అంతరాయం కలగకుండా జేసీబీలు, ట్రాక్టర్లు, మెకానికల్ రంపాలు, గొడ్డళ్లు, తాళ్లు తదితర పరికరాలను అందుబాటులో ఉంచారు. అలాగే డ్రాగన్ లైట్లు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయాలు, జనరేటర్లు, రెయిన్‌కోట్లు, హ్యాండ్ హారన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్, ట్రాఫిక్ కోన్లు, ఎల్ఈడీ బ్యాటెన్లు, రిఫ్లెక్టివ్ జాకెట్లు వంటి అత్యవసర సామగ్రిని సిద్ధం చేశారు.విద్యుత్ సరఫరా, మొబైల్ నెట్‌వర్క్ వ్యవస్థలకు అంతరాయం కలిగినా పోలీసు సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు వీహెచ్ఎఫ్ రిపీటర్లు, స్టాటిక్ సెట్లు, మొబైల్ సెట్లు, హ్యాండ్ సెట్లను అందుబాటులో ఉంచారు. తీరప్రాంత గ్రామాల్లో అవసరమైన చోట జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని ఎస్పీ సూచించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలకు దూరంగా ఉండాలని కోరారు. అధికారులు సూచించినప్పుడు సురక్షిత ప్రాంతాలకు, తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలివెళ్లి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ రహదారిపై ప్రత్యేక నిఘా

జిల్లాలో సుమారు 120 కిలోమీటర్ల మేర విస్తరించిన జాతీయ రహదారి-16పై అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల నిలుపుదల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పోలీసుల సూచనలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది తమ పరిధుల్లో నిరంతరం అందుబాటులో ఉంటూ పరిస్థితులను పర్యవేక్షించాలని, అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించాలని ఎస్పీ ఆదేశించారు.



అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయండి

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 112కు లేదా పోలీసుల వాట్సాప్ నంబర్ 9392903413కు సమాచారం అందించాలని, లేదంటే సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్పీ దా. అజిత వేజెండ్ల కోరారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలతో సమన్వయంతో పోలీసు యంత్రాంగం పనిచేస్తోందని ఆమె స్పష్టం చేశారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.